

# ప్రయోగం

సుస్మితా రమణామూర్తి

సునంద, సుధీర్‌ల స్నేహం ఇప్పటిది కాదు. పదేళ్ళ క్రితం నాటిది. హైస్కూల్లో చిలిపిగా పలకరించుకున్నాయ్— ఆ నాలుగు కళ్ళు. కాలం గడిచే కొద్దీ ఆ కళ్ళ బాంధవ్యం చిక్కబడింది. ప్రణయానికి దారి తీసింది. ఒకరు లేకుంటే ఒకరు లేరన్న భావన ఆ రెండు ఎదల్లో చోటు చేసుకుంది.

సునంద తల్లిదండ్రులు తనకు సంబంధాలు చూస్తున్నారు.

తనలోని బాధని— కోరికని నిర్భయంగా ఇంట్లో చెప్పలేక సతమతమవుతోంది. 'ఎలాగైనా సుధీర్ సంగతి చెప్పేయాలి' అని ఎన్నోసార్లు గట్టిగా అనుకుంది. తీరా తండ్రి ఎదుటగానీ, తల్లి ఎదుటగానీ ధైర్యంగా నోరు విప్పలేక మౌనం వహించ సాగింది.

తన వాళ్ళెదుట తన అభిప్రాయాన్ని ఎలాగూ ప్రకటించలేదు తను. మరి ఈ విషయం ఇంట్లో తెల్పేదెలా? ఇంట్లో వాళ్ళకు తెలియకపోతే వాళ్ళు సంబంధాలమీద సంబంధాలు చూడ్డం— పెళ్ళిచూపుల తతంగంలో ఒక బొమ్మలా తను కూర్చోడం— వాళ్ళు ఏ విషయమూ ఇంటి కెళ్ళినతర్వాత ఉత్తరం ద్వారా తెలియజేస్తామనడం— ఉత్తరం వచ్చేదాకా ఏమో, ఏమవుతుందో?— అన్న మానసిక వేదనకు గురికావడం...ఇవన్నీ అర్థంలేని తతంగాలు! వాటి మూలంగా ఎంత శ్రమ? ఎంత హైరానా! ఎంత డబ్బు దండుగ!

తన అభిప్రాయం ఇంట్లో తెలిస్తే ఏ గొడవా ఉండదు. అయితే ఎలా?...

ఈ విషయంలో తను అశక్తురాలు! పోనీ సుధీర్ పెద్దవాళ్ళద్వారా మాట్లాడిస్తేనో?... అవును. అలానే చేయాలి! అప్పుడే సమస్యా ఉండదు. సుధీర్ పెద్దవాళ్ళకి తనంటే ఇష్టం లేకుంటేనో?... అలా కానే కాదు. తనెన్నోసార్లు సుధీర్ ఇంటికి వెళ్ళింది.

తనమీద మంచి అభిప్రాయం—అభిమానం లేకుంటే సుధీర్ తల్లిదండ్రులు తనతో అంత కలుపుగోలుగా ఎందుకు మాట్లాడుతారు?...వాళ్ళకి తనంటే ఎంతో ఇష్టం!

'నీలాంటి అమ్మాయి ఈ ఇంటికి కోడలుగా వస్తే

నేం అదృష్టవంతులం' అంటూ ఎన్నోసార్లు తన ముందే అన్నారు వాళ్ళు.


వెంటనే సుధీర్‌ని కలియాలి. విషయాన్ని అర్థం అయ్యేటట్టుగా తన చెవిలో వేయాలి. ఆ తర్వాత అంతా తనే చూసుకుంటాడు.....

ఠంగ్! ఠంగ్!... గోడ గడియారం ఆరు గంటలు కొట్టింది.

సునంద ఆలోచనా ప్రపంచంలోంచి తేరుకుని, 'వెంటనే సుధీర్‌ని కల్సుకోవాలి!' అని స్వగతంలా అనుకుంది.

'ఒక అరగంట ఎంతటా? ఎంతటా?' అను కుంటూ రిక్షాలో సుధీర్ ఇంటికి వెళ్ళింది. తన పరిస్థితిని—మరోసారి తన నిర్ణయాన్ని తనతో చెప్పి ఎలాగైనా నా మా వాళ్ళతో మీ వాళ్ళను మాట్లాడేట్టు చేయమని కోరింది. బ్రతిమాలుకుంది. మొరపెట్టు కుంది.

"నీ వింతగా చెప్పాలా? నా కామాత్రం తెలీదూ? ఈ విషయంలో నీ కెంత బాధ్యత ఉందో—నాకూ అంతే బాధ్యత ఉంది. మరేం దిగులు పడకు. అన్నీ నే చూసుకుంటాగా!" సుధీర్ ధైర్యాన్ని మారి పోశాడు.




సుధీర్ మాటలకు ఉప్పొంగి పోయింది సునంద.

అంతవరకూ తనలో గూడు కట్టుకున్న ఆవేదన, ఆందోళన తొలగిపోయాయ్.

సుధీర్ సమక్షంలో వలభై నిముషాలు నాలుగు సెకండ్లలా గడిచిపోయాయ్.

"మరి నే వెళ్తా, సుధా! ఎనిమిది కావస్తోంది. నాన్నగారుకూడా ఇంటిదగ్గరే ఉన్నారు " అంటూ సునంద బయల్దేర బోయింది.

"బాగా చీకటిగా ఉంది. ఎందుకైనా మంచిది. ఇంటిదాకా నేవస్తా, పద!" అన్న సుధీర్ మాటల్ని త్రోసిపారేస్తూ సునంద అంది: "మరేం ఫర్లేదు, సుధా! నాకేం భయం? రిక్షాలో వెళ్తా!" సుధీర్ మరేం అనలేక పోయాడు.

సునంద వెళ్ళిపోయింది.

సుధీర్ అన్న మాట నిలబెట్టుకున్నాడు.

మూడు నెలలు తిరక్కుండానే వారి వివాహం జరిగిపోయింది.

ఆ రోజు— సుధీర్, సునందల కలలు పండిన రోజు!

ఎన్నో ఏళ్ళనుంచి వారు ఎదురు చూస్తున్న రోజు!

ఒకరి ఒడిలో మరొకరు సేద తీర్చుకోబోయే రోజు!

గంధర్వ కాంతలా తనముందు నిల్చున్న సునందని చూసిన సుధీర్, "సునూ! దగ్గరికి రా!" అంటూ తన కౌగిలిలోకి చేర్చుకోబోయాడు. తన ఆశ నిరాశే అయింది.

"నన్ను క్షమించు, సుధా!" అంటూ సునంద సుధీర్ కాళ్ళపై పడింది. అనుకోనిది జరిగినందుకు కొన్ని క్షణాలు సుధీర్ నివ్వెరపోయాడు. తన మస్తిష్కంలో ఏదో అలజడి! అనుమానం!......

'సునంద తననెందుకు క్షమించమంటోంది అంత చేయరాని పని తనేం జేసింది?!.....

తన మనస్సు ఏదో కీడుని శంకిస్తోంది.

'పరువాలు పండించుకోవాల్సిన ఈ శుభ తరుణంలో ఏమిటీ అపశ్రుతి?' సన్నగా మూలిగిందతని మనస్సు.

"నన్ను క్షమించు, సుధా! ఆ రోజు అంటే మీ వాళ్ళని మా ఇంటికి ఎలాగైనా పంపించమని నీతో చెప్పి మా ఇంటికి నే నొంటరిగా వెళ్ళిన రోజు! అదే! నీవు తోడు వస్తానన్నా నాకేం భయం?... అంటూ వెళ్ళిపోయిన ఆ రోజు!....."

"అవును! ఆరోజు ఏం జరిగింది!?.." అను మానంగా—ఆత్రంగా ఆందోళనగా అడిగాడు సుధీర్.

"జరక్కూడందే జరిగిపోయింది సుధా! నేవెళ్తున్న రిక్షాకి చెయిను తెగిపోయింది. వాడు బాగుచేసే ప్రయత్నంలో మునిగిపోయాడు. ఆరోడ్డంతా చీకటిగా ఉంది. మరో రిక్షాలో పోదామన్నా చుట్టు పక్కల మరో రిక్షా కన్పించలేదు. అప్పుడు మన క్లాస్‌మేట్ రమేష్ తన కార్లో ఒక్కడే అటువేపు పోతూ నన్ను చూసి కారాపేడు. విషయం తెల్సుకుని నన్నింటి దగ్గర దిగవిడుస్తానన్నాడు. నమ్మి తన కారెక్కాను. ఒక చీకటి దారిలో అంటే ఒక చీకటి సందులో కారాపి..." ఇక చెప్పలేక వెక్కి వెక్కి ఏడుస్తూ మళ్ళీ సుధీర్ కాళ్ళని చుట్టేసింది సునంద.

"వూ! కారాపి...." ఆత్రంగా అడిగాడు తను.

"ఇంకేం ఉంది? తన పశుత్వానికి నేనా కార్లోనే బలై పోయాను"

".... ....

"నన్ను నమ్ము, సుధా! నా కా ఉద్దేశం ఎప్పుడూ లేదు. ఈ విషయం నీకు అప్పుడు తెలియ జేయ డానికి భయపడ్డాను. కానీ... ఇప్పుడు నీకు తెలియ కుండా ఉంచలేక పోతున్నాను. నిన్ను వంచించాలని నేనెప్పుడూ అనుకోలేదు. నా మనస్సు— ఆలోచ నలు— నడవడి నీకు తెలియనివి కావు."

సుధీర్ అవాక్కయి తన మాటలు వినసాగేడు.

"భగవంతుని సాక్షిగా చెబుతున్నాను. నన్ను నమ్ము, సుధా! వాడి మూలంగా నా శరీరం అపవిత్ర మైనా— నా మనస్సులో మాత్రం ఎప్పటికీ నీకే స్థానం! నా పరిస్థితిని కాస్తంత అర్థం చేసుకోలేవా, సుధా!" ఏడుస్తూ— ఆయాస పడిపోతూ చెప్పింది సునంద.

అంతవరకూ ఎంతో శ్రోసెగ్గా ఆ వారం వార పత్రికలోని కథను చదివి, కథ ముగింపెలా జరిగిందా అని చివరి వాక్యాలు చూసిన గాయత్రి స్వగతంలా అనుకుంది: 'టచ్! అంత జరిగి తర్వాత కూడాఆ సునందను ఆదరించగల విశాల హృదయుడా సుధీర్!? ఆఫ్‌కోర్స్! రాసేవాడి ఆలోచనల ప్రకారం కాగితాల మీద అలా జరిగిపోవచ్చు. కాని... నిజ జీవితంలో సుధీర్‌లాంటి విశాలహృదయుడు మాటికి ఒక్క డంటే ఒక్క డుంటాడా? ఉండడు! ఎవరికి తెలీదు— ఈ మగాళ్ళ ఆలోచనలు— బుద్ధులూను?...

ప్రక్కింటి మగాణ్ణి కన్నెత్తి చూస్తేనే అను మానపడే ఈ మగాళ్ళు అంత విశాల హృదయులా? కేవలం ఆశావాదంతో ఈ కథ రాయడం జరిగిందే కాని వాస్తవాని కిది చాలా దూరం?.....

"ఏమిటే గాయత్రీ! ఈ కథఅప్పుడే చదివేశావా? ఎంతయినా మీ బావ రాసిన కథకదా? ప్రైగా నీక్కా బోయే శ్రీవారు కూడాను! చదవకుండా ఎలా ఉండ గలవ్?" అప్పుడే వచ్చిన గాయత్రి స్నేహితురాలు గీత తన చేతిలోంచి పత్రిక తీసుకుంటూ అంది.

"ఏమిటే? ఈ కథ! మా బావ రాసిందా!?"ఆశ్చ ర్యంతో పత్రికను మరోసారి చూసింది గాయత్రి.

"అవునే! మీ రామకృష్ణబావరాసిందే ఈ కథ! ఎలాగూ లాంఛనప్రాయపు పెళ్ళిచూపులు ఈరోజే కదా? కథ బ్రహ్మాండంగా ఉందంటూ అభినందనల వర్షం కురిపించేయ్—మీ బావమీద.నీ పొగడ్తలకు ఉక్కిరిబిక్కిరై పెళ్ళికి వచ్చజెండా వూపేస్తాడుతను. ఎలాగుంది మన ఆయిడియా?" నవ్వుతూ అంది గీత.

ఎన్నో ఏళ్ళనుంచి ఒకరికొకరం తెల్సుండికూడా ఇంకా జస్ట్ ఫర్ ఫార్మాలిటీ పేక్ పెళ్ళిచూపులట? ఎందుకో? తన అభిప్రాయాలు ప్రత్యేకించి తెల్సు కోడానికి ఏవో ప్రశ్నలు వేస్తాడట.....

చేయునే! తనకేం భయం? కథలో సుధీర్‌లాంటి ఆదర్శ వ్యక్తిని సృష్టించిన వ్యక్తి తను. ఎన్నో కథల్లో నేటి సమాజానికి కావలసిన ఆదర్శాలను గుప్పించిన తనలో అంతటి ఉన్నత సంస్కారం నిజంగా ఉందా? తనకు తెల్సినంతవరకూ బావకూడా సగటు మానవుడేను! బహుశా కేవలం కథకోసం— స్త్రీ అభ్యుదయం గురించి రచనలుచేస్తే మంచి పేరొస్తుందన్న ఆశతోను— ఉద్దేశంతోను అలా రాసి ఉంటాడు.

సుధీర్‌లాంటి సంస్కారవంతులు నిజంగా నిత్య జీవితంలో కొంతమందైనా ఉంటే విధి చేతిలో పరిహసింపబడ్డ కొందరి జీవితాల్లోనైనా ఆశాజ్యోతులు వెల్లివిరిసేవి కదా? ఏది ఏమైనా బావ అంతరంగం తెలుసుకోవాలి. కేవలం తను కాగితంపులో— లేక కొంతవరకైనా తనలో అభ్యుదయ భావాలు ఉన్నాయో లేదో తెల్సుకోవాలి. ఆ తర్వాతే పెళ్ళి గురించి ఒక నిర్ణయానికి రావడం!...

"ఏమిటే! ఆలోచనల్లో పడ్డావ్? ఎప్పుడు మీ బావ నీ మెళ్ళో మూడు ముళ్ళు వేస్తాడా?— అని కలలు కంటున్నావా? అలా తొందరపడితే ఎలా?" గీత పరిహాసంగా అంది.

గాయత్రి ఆలోచనలు తేలిపోయాయి.

*      *      *

"గాయత్రీ! మనం కొద్ది రోజుల్లో ఒకటి కాబోతున్నాం. ఒకరి జీవితం మరొకరితో ముడిపడబోతోంది. అలాంటప్పుడు ఒకరి భావాల్ని మరొకరు క్షుణ్ణంగా తెల్సుకోడం చాలా అవసరం అనుకుంటాను. మనం కొత్తవాళ్ళం కాదుగదా? ఇంకా ఈ అభిప్రాయ సేకరణ ఎందుకని నీ సందేహం. మరోసారి తెల్సుకోడంలో తప్పేం లేదనుకుంటాను." గాయత్రి బావ రామకృష్ణ నవ్వుతూ అన్నాడు— గాయత్రి వేపు తదేకంగా చూస్తూ.

"ఇంకా సంశయించడ మెందుకు బావా? నీవు కోరిన విధంగానే పెద్దవాళ్ళు మనకి ఏకాంతం కలిగించారు కదా?" గాయత్రి.

గాయత్రి తనలాగే బాగా చదువుకుంది. అందమైంది. పైగా ఒక్కర్తే కూతురుకూడా! కట్నం లేకుండానైనా చేసుకోవచ్చు. పెండ్లి అయ్యాక తనే ఈ ఇంటికి అధికారి కావచ్చు. ఈ ఏర్పాటు జరిగిన తర్వాత ఏవో నాలుగు ప్రశ్నలు అడక్కపోతే ఏం బావుంటుంది? అవును. అడగాలి. అయితే ఏమి అడగడం?....

"ఏమిటి, బావా! అభిప్రాయ సేకరణన్నావ్? ఏవో ప్రశ్నలు అడుగుతావనుకున్నగాని— ఇలా ఆలోచనల్లో తేలిపోతావనుకోలేదు. అవును, చెప్పడం మరిచాను. ఈ వారం పత్రికలో నువ్వు రాసిన కథ చాలా బావుంది, బావా! ముఖ్యంగా సుధీర్‌లోని సంస్కారం—విశాల హృదయం—అభ్యుదయ భావాలు నన్ను బాగా ఆకట్టుకున్నాయ్. ఇంతవరకూ నీవు రాసిన కథలన్నింటిలోనూ నాకు బాగా నచ్చిన కథది. కంగ్రాచ్యులేషన్స్! సుధీర్‌లాంటి ఆదర్శవ్యక్తులు నేటి సమాజానికి చాలా అవసరమన్న నిజం చాటి చెప్పింది నీ కథ! ఏదైనా కథల పోటీకి పంపించి ఉంటే ఖచ్చితంగా ఏదో ఒక బహుమతి వచ్చుండేది!"


గాయత్రి పొగడ్తలకి గాలి కొట్టిన బెలూన్‌లా ఉబ్బి తబ్బిబ్బయ్యాడు తను.

"నా స్నేహితురాలు రాజీ అన్నట్లు మంచి రాసేవాళ్ళు మంచి రచనలే చేస్తుంటారు. ఆదర్శ భావాలుగల నీలాంటి సంస్కారవంతులు ఎప్పుడూ అలాంటి సాంఘిక స్పృహగల రచనలే చేస్తుంటారు. నీవు నా భర్తగా లభించక పోవడం నిజంగా నాకెంతో సంతోషంగా ఉంది, బావా!" గాయత్రి.

ఈసారి మరింత పొంగిపోయాడు రామకృష్ణ.

ఎంతసేపూ గాయత్రి అలా గడగడా మాట్లాడటం తప్పిస్తే రామకృష్ణ నోరు విప్పడం లేదు. సంతోష పారవశ్యంతో ఇంకా కొట్టుకు పోతూనే ఉన్నాడు.

"బావా! ఒక్క విషయం జాగ్రత్తగా విని సమాధానం చెప్పు. ఆఫ్‌కోర్స్! నీలాంటి సహృదయుడు నా పరిస్థితిని సరిగానే అర్థం చేసుకుంటాడనే




ధైర్యం నాకుందనుకో. కొన్నాళ్ళలో మన మెలామూ భార్యాభర్తలం కాబోతున్నాం. మన మధ్య దాపరికాలుగాని— అరమరికలు గాని ఉండకూడదు. అందుకని ఆర్నెల్ల క్రితం జరిగిన ఒక సంఘటన నీకు చెప్పడమే భావ్యంగా ఉంటుందనిపిస్తుంది నాకు." ఆయాసం తీర్చుకోడానికి కాసేపు ఆగింది తను.

అంతవరకు సంతోషపు టలలపై తేలిపోతున్న రామకృష్ణ గాయత్రి మాటలకి 'షాక్' తిన్నట్లు ఫీలయ్యాడు.

"ఏం జరిగింది!?" అంటూ ఆత్రంగా— ఆదుర్దాగా అడిగాడు.

"ఆడదాని జీవితంలో ఏం జరక్కూడదో అదే జరిగింది. ఆ రోజు మా కాలేజీలో నాటకం అయిపోయిన తర్వాత ఒక్కర్తెనే ఇంటికి వచ్చేస్తున్నాను—నాటకం గురించి ఆలోచిస్తూ. అనుకోకుండా ఒక రౌడీ నన్నడ్డగించి బలవంతం చేశాడు. జరిగిన అఘాయిత్యం ఇంతవరకు నాలోనే దాచుకున్నాను. ఈ విషయం నీకు తెలియకుండా పెళ్ళిపీటలమీద కూర్చోవాలనీ నే ననుకోవడం ఒక విధంగా నిన్ను మోసం చేయడమే అవుతుంది. అలా చేయడం నా కిష్టం లేదు. నీ కథలో నేటి సమాజాన్ని మరామత్తు చేయడానికి సుధీర్‌లాంటి సంస్కారవంతుల అవసరం ఎంతైనా ఉందని ఎలుగెత్తి చాటిన నీకు నా పరిస్థితిని ఇంకా వివరించి చెప్పనవసరం లేదనుకుంటాను. దయచేసి నన్నర్థం చేసుకోడానికి ప్రయత్నించు బావా!" అంటూ గాయత్రి రామకృష్ణ ముఖంలోకి చూస్తూ మౌనం వహించింది.

విషయం అవగాహన అయిన రామకృష్ణను అంతవరకూ ఆవహించిన సంతోష పారవశ్యం వీడిపోయింది. ఇద్దరి మధ్య కొన్ని నిమిషాల నిశ్శబ్దం మంచులా కరిగి పోయింది.

"ఒక విధంగా చెప్పాలంటే నా పరిస్థితి నీ కథలో సునందలానే ఉంది." సీరియస్‌గా ఆలోచిస్తున్న రామకృష్ణ ముఖంలోకి సూటిగా చూస్తూ అంది గాయత్రి.

"వాస్తవం వేరు—కల్పన వేరు, గాయత్రీ! కథలు వేరు! జీవితం వేరు! కథలోలా వాస్తవంలోనూ జరుగుతుందని, జరగాలని అనుకోడం కేవలం పట్టి భ్రమ! మనం,మన మనస్తత్వాలు అంతవరకు ఎదగాలంటే ఇంకా చాలా టైమ్ పడుతుంది. నీ పరిస్థితికి జాలిపడి . . . సానుభూతి చినుకులు కురిపించడం తప్ప నేనేం చేయగలను చెప్పు?" రామకృష్ణ

గాయత్రి మౌనం వహించింది.

రామకృష్ణ లేచి వెళ్ళిపోయాడు—అక్కడ్నుంచి.

'బావ నిజంగా కాగితం పులే!' స్వగతంలా అనుకుంటూ నవ్వుకుంది గాయత్రి.

గాయత్రి తన అంతర్యం తెల్సుకోడానికి తను రాసిన కథను తనమీదే ప్రయోగించిందని చాలా కాలం తర్వాతగానీ తెల్సుకోలేక పోయాడు, పాపం, ది గ్రేట్ రచయిత రామకృష్ణ!!

*